




# వందనోటు వెక్కిరించింది

బి. వి. శేషమాంబ

సాధారణంగా చాలామంది డబ్బులు చేతులు మారేటప్పుడు నోట్లు బాగున్నాయా లేదా అని చూసుకుంటారు. కానీ కొందరు ఎవరు ఎలాంటి విచ్చినా చూసుకోకుండా తీసేసుకుంటారు. తర్వాత వాటిని మార్చబోయి ఇబ్బందుల్లో పడతారు. అదిగో అలాంటి వారిలో నేనూ ఒకణ్ణి. ఎక్కడైనా ఏమైనా కొన్నప్పుడో, ఆటోవాళ్లు చిల్లర ఇచ్చినప్పుడో కరెక్ట్‌గా ఇచ్చారా లేదా అని లెక్కపెట్టుకుంటాను కానీ నోట్లు బాగాన్నాయా లేదా అని చూసుకోను. ఎందుకో అలవాటు లేదు. ఎప్పటికప్పుడు చూడాలనుకుంటాను కానీ గుర్తుండదు. నా దగ్గరికి వచ్చిన చెత్తనోటు వదిలించుకోవటానికి తంటాలు పడుతుంటాను.

ఓ సారి ఆఫీస్‌లో ఇదే విషయం చర్చకి వచ్చింది. ఒక్కొక్కళ్లు తమ అనుభవం చెప్తున్నారు.

ఆటో దిగి వది రూపాయల నోటిస్తే అది చెల్లలేదని అది తప్ప తన దగ్గర మరొక నోటు లేక రోడ్ మీద కనిపించిన ఫ్రెండ్‌ని అడిగి వది రూపాయలు తీసుకున్నానని ఒకరు చెప్పారు.

గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి కాలేజీ రోజుల్లో హోటల్‌కి వెళ్లి యాభై రూపాయల నోట్ ఇస్తే అది మారక పోవటంతో, ఆమె బిల్ చెల్లించటం ఒకరు అనుభవం.

హనీమూన్‌కి ఊటీ వెళ్లి వస్తూ భార్య మనసువడిన చీరకొందామంటే వందనోటు షాపువాడు తీసుకోకపోవటంతో డబ్బులు చాలక భార్య కోరిక తీర్చలేకపోయానని ఇంకొకరన్నారు.

ఓ షాప్‌లో ఎంతకీ చెల్లని 20 రూ॥ల నోటు మడత బెట్టి మాయచేసి ఇస్తే అతను అసలు చెల్లని వది రూపాయల నోటిచ్చాడని చెప్పారు మరొకరు. కథలు కథలుగా చెల్లని నోట్ల గురించి వింటుంటే చెల్లని నోటు బాధితులు చాలామందే ఉన్నారని తెలిసింది నాకు.

ఇలా చర్చ నడుస్తుండగా "కొద్దిగా బుర్రవుంటే చెల్లని నోటు మార్చటం పెద్ద కష్టం కాదు" అన్నాడు కోతల రాయుడు. అతని అసలు పేరు సుబ్బారాయుడు.

కానీ ప్రతి దానికి వివరీతంగా కోతలు కోస్తాడని ఆఫీస్‌లో వాళ్లంతా కలిసి తగిలించిన నిక్‌నేమ్ "కోతల రాయుడు."

"అంటే మేమంత బుర్రలేని వాళ్లమా" అన్నాడు రంగారావ్ రెయిజయిపోతూ.

"అది నేను చెప్పను. మీరే తెలుసుకోండి" అన్నాడు రాయుడు టేబుల్ మీద కూర్చొని పేపర్ వెయిట్ తిప్పుతూ

"ప్రతి విషయంలోనూ కోతలేనా రాయుడూ" అన్నాడు పాండురంగ నాటకఫక్కీలో

"మీరంతా ఇంతే నేనేం మాట్లాడినా కోతలే అంటారు" ఉడుక్కున్నాడు రాయుడు.

"అలాగైతే ఈ నోటు మార్చు చూద్దాం" అన్నాను జేబులో రెడీగా ఉన్న చెల్లని వంద రూపాయల నోటు తీసి టేబుల్ మీద పెడుతూ, దాన్ని మా యింటి దగ్గరున్న తెలిసినతను ఇచ్చాడు. బాంక్ వాళ్లు కూడా తీసుకోలేదు దాన్ని.

"మారుస్తాను. మరి నాకేమిస్తావ్" అన్నాడు రాయుడు వెంటనే.

"యాభై రూపాయలిస్తాను" అన్నాను నేను తగ్గకుండా. అసలు లేని దానికంటే యాభై రూపాయలొచ్చినా వచ్చినట్టే కదా అని

"ఐతే వందెం. మీరంతా వినండి ఈ వంద రూపాయల నోటు మారిస్తే నాకు యాభై రూపాయలు ఇస్తాడట" అన్నాడు రాయుడు. ఆ నోటుని రెండు చేతుల్తో వట్టుకొని అందరికీ చూపిస్తూ

ఏదో వినోదం చూస్తున్నట్టుంది అందరికీ.

"ఓ.కె. ప్రొసీడ్ బెస్టాఫ్‌లక్" అన్నారంతా

"నువ్వది మార్చినట్టు నాకేవిటి సాక్ష్యం?" అడిగాను.

"ఈ వంద బదులు నేను నీకు ఇంకో వంద ఇస్తాను. నోటు మార్చినాక యాభై తీసుకుంటాను" అన్నాడు ధీమాగా.

"ఇది బాగానే వుంది ఐతే సరే" అన్నాను.

*** *** ***

ఆఫీస్‌లో అడుగుపెట్టగానే హుషారుగా ఎదురొచ్చాడు రాయుడు.

"వంద మార్చేశాను నా యాభైనాకియ్యి" అన్నాడు.

"ఒక్క రోజులో మార్చేశావా?" ఆశ్చర్యంగా అందరూ అతన్ని చుట్టు ముట్టేశారు.

"మరేమనుకున్నారు రాయుడంటే" కాలరెగరేశాడతను.

"ఎవరికిచ్చావు?" కుతూహలంగా అడిగాడు కొలీగ్.

"నిన్న ఆటో ఎక్కాను. వది రూపాయలయ్యింది. ఆ వంద నోటిచ్చాను. చిల్లరలేదన్నాడు. "కుమార్ వైన్స్" కనిపించింది నా బ్రాండ్ హాఫ్ బాటిల్ తెమ్మన్నాను. తెచ్చి చిల్లర ఇచ్చేశాడు" ఆనందంతో ముఖం వెలిగిపోతుండగా చెప్పాడు రాయుడు.

నెమ్మదిగా అందరూ ఎవరి సీట్లో వారు సర్దుకుంటుండగా వచ్చాడొకతను. సరాసరి రాయుడు దగ్గరికి వచ్చి "సార్ నిన్న మీరు ఇచ్చిన వంద రూపాయల నోట్లు రెండూ చెల్లవుసార్. ఎవ్వరూ తీసుకోవటం లేదు" అంటూ రాయుడి టేబుల్ మీద పెట్టాడు నోట్లు. స్టన్నయ్యాడు రాయుడు.

"నేనెప్పుడిచ్చాను" అన్నాడు మళ్లీ అందరూ సీట్లలోంచి లేచి రావటం చూసి తెల్ల ముఖం వేసి చూస్తూ

"అదే సార్ నిన్న మీరు ఆటో అతన్ని వంపించారు రెండు బాటిల్స్ తెమ్మని" అన్నాడు గుర్తు చేస్తూ.

"అప్పుడు ఒక్క బాటిల్‌గా తెమ్మన్నది" అన్నాడు రాయుడు అయోమయంగా.

"లేదు సార్! అతను రెండు బాటిల్స్ తెచ్చాడు. సరిగ్గా గుర్తు చేసుకోండి" అన్నాడతను బిక్కముఖం వేసి.

"ఔను రాయుడూ! అప్పుడు నేను కూడా అక్కడే ఉన్నాను. నువ్వు నీ నోటుతో పాటు చెల్లని నోటు మారుస్తున్నావనుకున్నాను" అన్నాడు రంగారావు వస్తున్న నవ్వు ఆపుకుంటూ.

"గుర్తొచ్చింది. ఆటో అతను ఒక బాటిల్ ఆటోలో పెట్టుకున్నాడు" అన్నాడు రాయుడు నీరసంగా

అంటే ఆటో అతను రాయుడిచ్చిన నోటుతో పాటు, తన దగ్గరున్న చెల్లని నోటు కూడా ఇచ్చి తెలివిగా మార్చాడన్నమాట. ఏడుపొక్కటే తక్కువనిపించింది రాయుడి ముఖం చూస్తే.

"రెండు బాటిల్స్ మీకనే చెప్పాడు. త్వరగా ఇవ్వండి సార్. మా మేనేజర్ నన్ను సతాయిస్తున్నాడు నిన్నటి నుంచి" అన్నాడు బార్ కాషియర్.

తప్పనిసరై రెండు మంచినోట్లు తీసి ఇచ్చాడు రాయుడు.

"ఐనా రాయుడూ నువ్వు ఒకసారి నోటు మార్చావు. నువ్వు వందెం గెలిచినట్టే మీకిద్దరికీ ఫిఫ్టీ ఫిఫ్టీ" అన్నాడు రంగారావు రాయుణ్ణి ఉడికించటానికి.

"బాసూ! ఫిఫ్టీ వస్తోంది కదాని బాటిల్ కొన్నాను. నన్ను న్యాయం చెయ్యకు" అన్నాడు రాయుడు నా గడ్డం వట్టుకొని.

చిరునవ్వుతో వంద రూపాయలు అతని చేతిలో పెట్టాను. నేనిచ్చిన నోటు తిరిగి ఇచ్చేశాడు రాయుడు.

"నన్ను మార్చలేకపోయారు" అని వెక్కిరిస్తున్నట్టు రెపరెపలాడింది వంద రూపాయల నోటు నా చేతిలో.



## సన్యాసమే?

మీ నాన్నగారి జీతం మూడు వేలు. ఇంటి యజమానికి మూడు నెలల అద్దె 1500 రూపాయలు, కూరల వాడికి 150 రూపాయలు, పాలవాడికి 800 రూపాయలు, వెచ్చాల దుకాణంవాడికి 1500 రూపాయలూ, వనిమనిషికి 400 రూపాయలూ, నీ ఫీజులు 600 రూపాయలు ఇవ్వాలి. ఈ వరిస్థితిలో మీ నాన్న గారు ఎలా మేనేజ్ చేస్తారో చెప్పు" అడిగాడు టీచర్ రవిని.

"మా నాన్న గా రయితేనండి 'అర్ధరాత్రి' ఇల్లు వదిలి వెళ్లిపోతారు సార్" అన్నాడు రవి.

శ్రీశారద, వాడ్రేవుపల్లి]

## దేవుడి పని

మీర్జా గాలిబ్‌కు పెన్షన్ అనదింది. మొత్తం డబ్బు పెట్టి సారా తాగేశాడు. భార్య - "అంత డబ్బూ పెట్టి తాగేస్తే భోజనం గడిచేది ఎలాగండి?" అంటూ గోలపెట్టింది.

"ఖురాన్‌లో దేవుడు భోజనం ప్రసాదిస్తాడని ఉంది కాని, మదిర ప్రసాదిస్తాడని లేదు. మదిర నేను సేవించి వచ్చాను. భోజనం ఆయన ఇస్తాడు" అన్నాడు గాలిబ్ కవిత్వ ధోరణిలో.

బద్దిగం పాండురంగారెడ్డి [కరీంనగర్]

